సాక్షి
మంచిర్యాల

బుధవారం, 27, నవంబర్, 2024



అతిథుల కిలకిలలు

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ఇవి సౌత్ ఆఫ్రికా నుంచి ఇక్కడికి వలస వచ్చినట్లు తెలుస్తోంది. 8లో



పట్టుబడిన గంజాయి దహనం

జిల్లాలో పట్టుబడిన గంజాయిని దహనం చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాసులు తెలిపారు. గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. 8లో

గరిష్టం/కనిష్టం
28.0 /16.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రివేళ, వేకువజామున చలితీవ్రత పెరుగుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: విద్య, వైద్య, సాహిత్య, కళ, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవలందించిన, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రైస్తవులు, క్రైస్తవ సంస్థల నుంచి సన్మానం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 ఏళ్లకు పైబడిన వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ ఫారాలు హైదరాబాద్‌లోని రాష్ట్ర క్రైస్తవ (అల్ప సంఖ్యాక) ఆర్థిక సంస్థ, మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి లేదా www.tgcmfc.in నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన నామినేషన్లను కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయంలో డిసెంబర్ 5లోపు ఇవ్వాలని సూచించారు.

సీవోఈ గురుకులం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) బాలుర గురుకుల కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదిలోకి వెళ్లారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు గెలుచుకున్న విద్యార్థులను అభినందించారు. క్రీడా మైదానం సరిగా లేని దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా మందమర్రి ఏరియా సింగరేణి జీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గురుకులంలోని ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సీవోఈ ప్రిన్సిపాల్ డీ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ విజయ సాగర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన వార్షిక తనిఖీలు



ప్రతిజ్ఞ చేస్తున్న డీఐజీ, కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ బెటాలియన్ల డీఐజీ ఎంఎస్.సిద్దిఖీ వార్షిక తనిఖీలు రెండోరోజు కొనసాగాయి. మంగళవారం ఉదయం పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ బ్యాండ్ ప్రదర్శనను సిద్దిఖీ తిలకించారు. పోలీస్ కవాతును పర్యవేక్షించి సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం యూనిట్ ఆస్పత్రి, పోలీస్ వెల్ఫేర్ స్టోర్‌ను సందర్శించారు. పోలీస్ దర్బార్‌లో పాల్గొని సిబ్బంది, కుటుంబాల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి పోలీస్‌శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో కమాండెంట్ పీ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, మినిస్టీరియల్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

లిక్కర్ గోదాం వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న గోదాం కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కేంద్రప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం గుడిపేట లిక్కర్ గోదాం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ మన వనరులు, సంపద, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు విక్రయిస్తోందని ఆరోపించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను మార్చడంతో పాటు సమ్మె హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తూ శ్రమ దోపిడీ సాగిస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా రైతు, కార్మిక, ప్రజల డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లిక్కర్ గోదాం హమాలీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, బైరి రమేశ్, కోశాధికారి మహేందర్, నాయకులు శంకర్, వెంకటేశ్, అనిల్, మహేశ్, సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆశ్రమాన్ని వెంటాడుతున్న వ్యాధులు



జ్వరంతో బాధపడుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థి అశ్విత్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాలను సందర్శించగా విద్యార్థులను చలి సమస్య వెంటాడుతోంది. ఇవి చెరువులను ఆనుకుని ఉండటంతో చలి అధికంగా ఉంది. వీటిలో ఎక్కడా వాటర్ హీటర్లు లేవు. విద్యార్థులు చన్నీటి స్నానమే చేస్తూ జలుబు, దగ్గు బారిన పడుతున్నారు. కొందరికి జ్వరం వస్తుండగా ఇంకొందరు చర్మసంబంధ సమస్యలతో బాధ పడుతున్నారు.

దుప్పట్లు రాలే.. స్వెట్టర్లు ఇవ్వలే..



ఎంజేపీ గురుకులంలో ఎండలో కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

తాండూర్: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో 435 మంది విద్యార్థులుండగా వీరికి స్వెట్టర్లు పంపిణీ చేయలేదు. సోలార్ వాటర్ హీటర్ కూడా లేదు. విద్యార్థులు చన్నీటి స్నానమే చేస్తున్నారు. కేజీబీవీలో సోలార్ వాటర్ హీటర్ పాడై ఏడాదైనా మరమ్మతు చేయించడంలేదు. బాలికలు చన్నీటి స్నానం చేయాల్సి వస్తోంది. ఆరో తరగతి విద్యార్థునులకు ఇంకా దుప్పట్లు అందించలేదు. దీంతో ఇంటి నుంచి తెచ్చుకున్నవే వారు వినియోగిస్తున్నారు.

రెగ్యులర్ వార్డెన్ లేక కొరవడిన పర్యవేక్షణ



అపరిశుభ్రంగా కోటపల్లి ఎస్సీ హాస్టల్ వంట గది

కోటపల్లి: కోటపల్లి ఎస్సీ బాలుర హాస్టల్‌లో 120 మందికి 100మంది విద్యార్థులే ఉంటున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. బాత్‌రూంలు కంపు కొడుతున్నాయి. హాస్టల్‌లో ఒకే బోరు ఉంది. విద్యార్థులు పడుకునే గదిలోనే భోజనం చేయాల్సి వస్తోంది. రెగ్యులర్ వార్డెన్ లేక విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారు. మెనూ పాటించకపోవడంతో నాణ్యత లేని భోజనం పెడుతున్నారు. ఇక్కడి విద్యార్థులకు చలిలోనూ చన్నీటి స్నానం తప్పడంలేదు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా ప్రస్తుత చలికాలంలో వీరు ఎదుర్కొంటున్న ఇక్కట్లు వర్ణనాతీతం. జిల్లాలోని దాదాపు అన్ని హాస్టళ్లలో విద్యార్థులు చన్నీటి స్నానమే చేస్తున్నారు. కొన్ని చోట్ల సోలార్ వాటర్ హీటర్లున్నా ఎక్కడా పని చేయడంలేదు. వాటికి మరమ్మతు చేయించిన దాఖలాలు లేవు. పలుచోట్ల విద్యార్థులు మధ్యాహ్నం పూట స్నానం చేస్తున్నారు. చాలాచోట్ల దుప్పట్లు అందక ఇంటి నుంచి తెచ్చుకున్న చెద్దర్లనే వినియోగిస్తున్నారు. నిద్రించే గదుల తలుపులు, కిటికీలు సరిగా లేని చోట రాత్రివేళ విద్యార్థులు చలికి గజగజ వణుకుతున్నారు. ఇక భోజనం మెనూ షరా మామూలే. మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగుచూశాయి.

చలిలోనూ చన్నీటి స్నానమే..

సాక్షి విజిట్



దండేపల్లి: చన్నీటి స్నానం చేస్తున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

లక్సెట్టిపేటలో కిటికీలకు తలుపుల్లేక..



బీసీ బాయ్స్ హాస్టల్‌లో కిటికీలు ఇలా..

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఆరుబయట చన్నీటి స్నానం చేస్తున్నారు. పడుకునే గదుల కిటికీలకు తలుపులు లేక రాత్రివేళ చలికి వణుకుతున్నారు.

- పంపిణీ కాని దుప్పట్లు, కార్పెట్లు
- వణుకుతున్న హాస్టల్ విద్యార్థులు
- చాలాచోట్ల మరమ్మతుకు నోచుకోక వృథాగా వాటర్ హీటర్లు
- కొన్నిచోట్ల తాగునీటికీ బయటికే..
- 'సాక్షి' విజిట్‌లో వెల్లడైన సమస్యలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహంలో 200 మంది విద్యార్థులుండగా వీరికి వేడినీటి సౌకర్యం లేదు. ఎముకలు కొరికే చలిలోనూ చన్నీటి స్నానమే చేస్తున్నారు. ప్రభుత్వం దుప్పట్లు అందించకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న చెద్దర్లే కప్పుకొంటున్నారు. విరిగిన కిటికీలకు అట్టముక్కలు అడ్డుపెట్టినా వారి చెద్దర్లు చలిని ఆపలేకపోతున్నాయి. మంగళవారం అల్పాహారం కింద జీర రైస్ విత్ సూప్‌కు బదులు మామూలు అన్నమే పెట్టారు. బూస్ట్ మిల్క్, బనానా అందించారు. ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహంలో కిచిడి, రసం, అరటిపండు ఇచ్చారు. ఇక్కడా విద్యార్థులకు చన్నీటి స్నానాలు తప్పడంలేదు.

హాస్టళ్లలో సమస్యలు ఇలా..

జిల్లాలో 23 ఎస్సీ వసతిగృహాలున్నాయి. ఇందులో 15 ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 1,237 మంది ఉన్నారు. వీరికి ఇటీవల దుప్పట్లు అందజేశారు. ఎనిమిది పోస్టు మెట్రిక్ హాస్టళ్లుండగా 830 మంది వసతి పొందుతున్నారు. ఇక్కడ దుప్పట్లు, కార్పెట్లు అందక ఇంటి నుంచే తెచ్చుకున్నారు. ఐదేళ్ల కిందట 15 వసతిగృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో దొనబండలో మినహా ఎక్కడా పనిచేయటం లేదు. కోతుల కారణంగా డ్యామేజ్ అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

- 16 బీసీ హాస్టళ్లలో 1,645 మంది విద్యార్థులుంటున్నారు. ఎనిమిది ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 748 మంది, ఎనిమిది పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో 897 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇందులో ప్రీమెట్రిక్ విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్లు అందక చలికి వణికిపోతున్నారు.
- 16 ఎస్టీ ఆశ్రమ, రెండు పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 3,249 మంది విద్యార్థులు ఉంటున్నారు. జూన్‌లో ప్రీమెట్రిక్ విద్యార్థులకు బెడ్ షీట్లు అందించినా బ్లాంకెట్లు రావాల్సి ఉంది. ఎనిమిదేళ్ల కిందట వేడి నీళ్లు అందించేందుకు ఆరు బాలికల వసతిగృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయగా.. కవ్వాల్, లక్సెట్టిపేటలో మాత్రమే పని చేస్తున్నాయి.
- 18 కేజీబీవీల్లో 4,520 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. రెండేళ్లవుతున్నా దుప్పట్లు, కార్పెట్లు సరఫరా కాలేదు. అప్పట్లో తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్ కార్పొరేషన్ సొసైటీ లిమిటెడ్ ఒక్కో కేజీబీవీకి 40 నుంచి 320 వరకు సరఫరా చేసింది. ఇందులో పలు కేజీబీవీలకు రగ్గులు ఇచ్చి చేతులు దులుపుకోగా, దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం, కాసిపేట కస్తూర్బా విద్యాలయాలకు ఒక్కటీ అందనట్లు తెలుస్తోంది. 14 కేజీబీవీల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయగా నాలుగు చోట్ల మాత్రమే పనిచేస్తున్నాయి.

ఇంటి నుంచే దుప్పట్లు.. బయటి నుంచి తాగునీరు

దండేపల్లి: సోలార్ వాటర్ హీటర్ మరమ్మతుకు నోచుకోక దండేపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు చలికాలంలోనూ చన్నీటి స్నానం చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్ పని చేయక విద్యార్థులకు శుద్ధజలం అందడంలేదు. బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇందులో 14 మంది విద్యార్థులుండగా, వీరికీ చన్నీటి స్నానం తప్పడంలేదు. ఇక్కడా ఆర్వో ప్లాంట్ పనిచేయక బయటి నుంచే తాగునీరు తెప్పిస్తున్నారు. కేజీబీవీలో సుమారు 160 మంది బాలికలుండగా చెద్దర్లు, దుప్పట్లు అందించలేదు. దీంతో వారు ఇంటినుంచే తెచ్చుకున్నారు. ఇక్కడా ఆర్వో ప్లాంట్ పనిచేయక బయటి నుంచే తాగునీరు తెప్పిస్తున్నారు.

దస్నాపూర్‌లో స్నానాలు మధ్యాహ్నమే..



దస్నాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పగలు స్నానం చేస్తున్న విద్యార్థులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని దస్నాపూర్ శివారులోగల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 212 మంది విద్యార్థులుండగా మంగళవారం 170 మంది మాత్రమే ఉన్నారు. సోలార్ వాటర్ హీటర్ ఆరు నెలలుగా పని చేయక విద్యార్థులు ఎక్కువ శాతం పగటిపూటే స్నానం చేస్తున్నారు. దీనిని మరమ్మతు చేయించడంలేదు. ఆశ్రమ పాఠశాల వెనుక భూవివాదం కారణంగా ప్రహరీ నిర్మించలేదు. దీంతో పాములు, విషపురుగు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. ఆశ్రమం పక్కనే ఆహార వ్యర్థాలు పడేస్తుండగా దుర్గంధం వ్యాపిస్తోంది. ఆశ్రమంలో పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు.

కేజీబీవీలోకి అనుమతి లేదట

నస్పూర్: పట్టణ పరిధిలోని కస్తూర్బా విద్యాలయంలోకి ఇతరులకు అనుమతి లేదని ఎస్వో మానిక సందర్శనకు నిరాకరించారు. ఉన్నతాధికారుల అనుమతితో రావాలని తెలిపారు. సౌకర్యాలు బాగానే ఉన్నాయని, మెనూ పాటిస్తున్నామని చెప్పారు.

మండలాల్లో ఇదీ పరిస్థితి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, గుడిపేటలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, దొనబండలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కర్ణమామిడిలో కేజీబీవీలో విద్యార్థులు చలికి తట్టుకోలేక పోతున్నారు. కొన్నిచోట్ల కిటికీలు విరిగాయి. చాలాచోట్ల చన్నీటి స్నానాలు తప్పడం లేదు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నా నాణ్యత లోపిస్తోంది. ముల్కల్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రైవేట్ భవనంలో కొనసాగుతుండగా మూత్రశాలలకు ఇబ్బంది పడుతున్నారు. వీటి కిటికీలు మరమ్మతుకు నోచుకోవడంలేదు.

చెన్నూర్: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో సోలార్ వాటర్ హీటర్ మరమ్మతుకు నోచుకోక విద్యార్థులు ట్యాంక్‌లోని చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. నిద్రించే గదులకు కిటికీలు లేక చలికి వణికిపోతున్నారు. శుద్ధజలం అందక బోరు నీటినే తాగుతున్నారు. రెండురోజుల క్రితమే దుప్పట్లు పంపిణీ చేసినట్లు విద్యార్థులు తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రిలోని రెండో జోన్‌లో ఉన్న ప్రభుత్వ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులకు స్నానానికి వేడినీటి సౌకర్యంలేదు. విద్యార్థులు బోరు వద్ద చన్నీటి స్నానం చేస్తున్నారు. వీరికి దుప్పట్లు అందక రాత్రివేళ చలికి గజగజ వణికి పోతున్నారు.

భీమిని: భీమిని కస్తూర్బా విద్యాలయంలో సోలార్ వాటర్ హీటర్ మరమ్మతుకు నోచుకోలేదు. కన్నెపల్లి కేజీబీవీలో సోలార్ వాటర్ హీటర్ లేదు. ఈ రెండు చోట్ల బాలికలు చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. దుప్పట్లు రాక ఇంటి నుంచి తెచ్చినవే వాడుకుంటున్నారు. కన్నెపల్లి కేజీబీవీకి ప్రహరీ లేక మూగజీవాలు, విషసర్పాలు వస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర సాధన కాలం నాటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలించేలా పోరాటాలు చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. ఈనెల 29న దీక్షా దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలో చేపట్టనున్న కార్యక్రమంపై పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. దీక్షా దివస్ కార్యక్రమం విధివిధానాలపై పలు సూచనలు చేశారు. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి చరిత్రపై కేసీఆర్ చెరగని ముద్రవేశారని కొనియాడారు. కార్యక్రమంలో దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న క్వారీలో ట్రెక్కింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 8 నుంచి 11గంటల వరకు క్వారీలో హైకింగ్ (ట్రెక్కింగ్) నిర్వహించనున్నట్లు లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనేవారు రూ.100 ప్రవేశ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. మొదటి 30 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు.

30న గాంధారి ఖిల్లాలో..

ఈ నెల 30న ఉదయం 8గంటలకు గాంధారి ఖిల్లా 360 డిగ్రీల పాయింట్‌కు ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు సుభాష్ మరో ప్రకటనలో తెలిపారు. 12ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రులు, శిక్షకులతో హాజరు కావాలని పేర్కొన్నారు. ట్రెక్కింగ్‌కు వైహెచ్ఏ వలంటీర్లుగా రవి సిరిపురం, శ్యాంసుందర్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు బీట్ అధికారి రాజేందర్‌ను 9948805488, లేదా వలంటీర్‌ను 9603346478 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో 315 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2,710 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 121 మంది రైతుల ఖాతాల్లో రూ.1.83కోట్లు జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 13 రైస్ మిల్లులకు సీఎంఆర్ అనుమతులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

సర్వేలో సేకరించిన కుటుంబ సభ్యులు వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సర్వే వివరాల నమోదు కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్ తదితరులున్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



మంచిర్యాలఅగ్రికల్చర్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

బార్ అసోసియేషన్ కార్యాలయంలో..



మంచిర్యాలక్రైం: ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం న్యాయవాదులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు అర్పిత మారం రెడ్డి, ఉపనిషధ్వని, నిరోష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



అతిథుల కిలకిలలు

- శీతాకాల విడిదికోసం చెన్నూర్ అటవీ ప్రాంతానికి పక్షుల వలస
- గోదావరి, ప్రాణహిత తీరంలో సందడి
- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం రాకతో వెలుగులోకి..

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ బృందం సభ్యులు రెండురోజుల పాటు పర్యటించారు. సౌత్ ఆఫ్రికా నుంచి వివిధ రకాల పక్షులు, సీతాకోక చిలుకలు వలస వచ్చినట్లు గుర్తించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని శివ్వారం, గొల్లవాగు ప్రాజెక్ట్, అర్బన్ ఏకో పార్కులలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్, హర్షన్, సోహన్ నాలుగు రోజుల క్రితం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో సర్వేశ్వర్, చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో చెన్నూర్, మంచిర్యాల, నీల్వాయి రేంజ్ అధికారులతో కలిసి పక్షి జాతులపై సర్వే నిర్వహించారు. చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో ఉండడంతో అరుదైన పక్షులు సౌత్ ఆఫ్రికా నుంచి శీతాకాల విడిది కోసం వలస వస్తున్నాయి. చెన్నూర్ అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులు, 72 రకాల సీతాకోకచిలుకలను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు. – చెన్నూర్

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని పాత థియేటర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు అనిల్ కథనం ప్రకారం.. రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లగా రాత్రి సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇస్త్రీకి వచ్చిన బట్టలు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాన్సీనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన రాజశేఖర్ మంగళవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా జాన్సీనగర్ వద్ద ఎదురుగా వచ్చిన క్యాంపర్ వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

మూడు మూగజీవాలు సజీవ దహనం

ఉట్నూర్‌రూరల్: విద్యుదాఘాతంతో మూడు మూగజీవాలు సజీవ దహనమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగంగాపూర్‌కు చెందిన సాగల సాయన్న సోమవారం రాత్రి తన రెండు ఎడ్లు, ఆవును పశువుల పాకలో కట్టేశాడు. విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగడంతో మూడు మూగజీవాలు సజీవ దహనమయ్యాయి. వాటితో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, పంటలకు వినియోగించే మందులు దగ్ధమయ్యాయని, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ అన్నారు. సోమవారం ఉట్నూరు డిపోకు చెందిన బస్సు ఢీకొట్టి జైనథ్ మండలంలో ఇద్దరు మృతి చెందడంతో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రతీ ఉద్యోగి పాటుపడాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో పొగమంచు వలన సైతం ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై దయానంద్ పాల్గొన్నారు.

వరంగల్ హైవే భూపరిహారం పెంపు


ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి టేకుమట్ల, ఎల్కంటి, నర్సింగాపూర్, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, రొమ్మిపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న వరంగల్–విజయవాడ నేషనల్ హైవే రోడ్డులో నష్టపోతున్న భూములకు ఎకరాకు సుమారు రూ.20 లక్షల వరకు పరిహారం పెంచినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. మంగళవారం రొమ్మిపూర్ శివారులో రైతులతో మాట్లాడారు. చెట్లు, బోర్లు, పైపులు నష్టపోతున్న రైతులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకుముందు నర్సింగాపూర్, కుందారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి గన్నీ సంచుల కొరతలేకుండా చూడాలని ఆదేశించారు.

విరిగిన 33కేవీ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో సపోర్టు వైరు తెగిపోవడంతో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో అర్లి(టి) సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఏఈ తిరుపతి రెడ్డి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలి

- బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్

బాసర: ప్రజాస్వామ్య దేశంలో ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగంలో పొందుపర్చబడిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను గౌరవించాలని బాసర ట్రిపుల్ ఐటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం శాశ్వతమైన విలువలను, మార్గదర్శక సూత్రాలుగా కొనసాగిస్తుందన్నారు. ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ మన వ్యవస్థలన్నీ రాజ్యాంగంతో ముడిపడి ఉంటాయన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, కన్వీనర్ డాక్టర్ అజయ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

ఓరియంట్ కంపెనీ పనుల అడ్డగింత

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ గుట్ట ప్రాంతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ వేస్తున్న హద్దురాళ్ల పనులను మంగళవారం స్థానిక ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు, పీసా గ్రామ సభ లేకుండా గుట్ట ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. కంపనీ యాజమాన్యం దొంగచాటుగా హద్దులు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కంపనీ సున్నపురాయి లీజు పొడిగింపులో అటవీ భూములు తీసుకుంటుండటంతో రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఆధ్వర్యంలో రొట్టెపల్లి ప్రాంతంలో కంపనీ భూములు తీసుకుని అటవీశాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంతో అడ్డుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, కోవ వినోద్, చిక్రం రాందాస్, సిడం తిరుపతి, చిక్రం లింగారావ్, తదితరులు పాల్గొన్నారు.


పనులు అడ్డుకుంటున్న ఆదివాసీ నాయకులు

భార్యను చంపిన కేసులో జీవితఖైదు

కుభీర్(ముధోల్): భార్యను చంపిన కేసులో భర్తకు జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ మంగళవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రలోని సిరంజనికి చెందిన బాలాజీకి మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన నవనీతతో 2011లో వివాహమైంది. భార్యపై అనుమానం పెంచుకున్న బాలాజీ తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవకు దిగేవాడు. పెద్దలు నచ్చజెప్పడంతో మండలంలోని రాజూరాకు మకాం మార్చారు. అక్కడ కూడా గొడవలు జరగడంతో నవనీత పుట్టింటికి వెళ్లిపోయింది. 2020 అక్టోబర్ 1న బెల్గాంకు వెళ్లి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ 12న మృతి చెందింది. మృతురాలి బంధువు ముడుగుల పరశురాం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ఉమేశ్ కేసు నమోదు చేయగా ఎస్సై ఎల్.ప్రదీప్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ 20మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

బాసర హుండీల లెక్కింపు

- 89 రోజుల ఆదాయం రూ.1,00,30,657

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం ఆలయ అక్షరాభ్యాస మండపంలో ఈవో విజయరామారావు, వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ ఆధ్వర్యంలో లెక్కించారు. 89 రోజుల హుండీ ఆదాయం రూ.1,00,30,657 నగదుతోపాటు మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 4.250 కిలోలు వచ్చినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ నోట్లు 147 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో ఏఈవో సుదర్శన్, ఎస్‌బీఐ బ్యాంక్, పోలీసు సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటీ సభ్యులు, శ్రీశైల భ్రమరాంబిక సేవాసమితి కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో సేవా సమితి సిబ్బంది

భర్తను హతమార్చిన భార్య


గులాల్ సర్కార్ మృతదేహం

ఆసిఫాబాద్: భార్య చేతిలో భర్త హతమైన సంఘటన కాగజ్‌నగర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామానికి చెందిన గులాల్ సర్కార్ (44) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గులాల్ సర్కార్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం కూడా దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య సరస్వతి క్రికెట్ బ్యాట్‌తో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కమల సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సందీప్ పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉత్తరాఖాండ్‌లోని హరిద్వార్ ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో హాజీపూర్ మండలం ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ప్రకాశ్‌రాథోడ్ బంగారు పతకం సాధించాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమ్యారాణి, పీఈటీ కిరణ్‌కుమార్, అధ్యాపక బృందం సదరు విద్యార్థిని అభినందించారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- సర్వీస్ బుక్‌లో సంతకం చేయడం లేదని అఘాయిత్యం
- ఆర్డీవో కార్యాలయంలో పురుగుల మందు తాగిన వైనం

కైలాస్‌నగర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన గంట అభిషేక్ వీఆర్‌ఏగా పనిచేస్తూ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. 2021లో అదే మండలంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎర్రం నరేందర్‌తో పాటు వీఆర్‌ఏగా ఉన్న అభిషేక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. విచారణను ఎదుర్కొన్న నరేందర్ ప్రస్తుతం ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీపై వచ్చారు. అయితే ఇతరశాఖలో సర్దుబాటు అయిన అభిషేక్ ఇంకా సస్పెన్షన్‌లోనే ఉన్నారు. ఆయన ఇతరశాఖలో సర్దుబాటు అయిన ఆ ఉద్యోగి సర్వీస్ బుక్‌లో సంబంధిత తహసీల్దార్ సంతకం తప్పనిసరిగా అవసరముంది. దీంతో ఆదిలాబాద్ డీఏవోగా పనిచేస్తున్న నరేందర్ వద్దకు సంతకం కోసం వచ్చారు. ఆయన నిరాకరించడంతో వేదనకు గురైన అభిషేక్ సదరు అధికారి ఎదుటే పురుగుల మందు తాగాడు. దీంతో ఆందోళనకు గురైన ఆర్డీవో, కలెక్టరేట్ ఉద్యోగులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు ఆరా తీశారు. ఈ విషయమై ఆర్డీవో వినోద్ కుమార్‌ను సంప్రదించగా ఇతర శాఖలో సర్దుబాటు అయిన ఉద్యోగి ఎస్‌ఆర్‌లో ప్రొసీడింగ్ ప్రకారం సంబంధిత తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా జిల్లా కేంద్రానికి వచ్చి డీఏవోను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారన్నారు. ఎద్దైనా సమస్య ఉంటే సంబంధిత కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే సదరు వ్యక్తి ఘలాట సృష్టించాడన్నారు. సదరు వ్యక్తిపై డీఏవో స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు.


డీఏవో చాంబర్ ఎదుట బాధితుడు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి లాంగ్ టెన్నీస్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల బెల్లంపల్లిలోజరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, వర్షిత్, చరణ్ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 27నుంచి హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.నారా యణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 29న ఫుడ్‌పాయిజన్‌తో దాదాపు 60 మంది గిరిజన విద్యార్థినులు ఆస్పత్రిలో చేరగా శైలజ మాత్రం 25 రోజులుగా వెంటిలేటర్‌పై ఉండి సోమవారం తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

జైపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఐకే1ఏ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, మధుకర్ పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


తిరుపతి (ఫైల్)

మంచిర్యాలక్రైం: అనారోగ్యంతో ఉన్న భార్యను చూసేందుకు అత్తారింటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి భరతపు తిరుపతి (31) భార్య సోనియాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వారం రోజుల క్రితం కాలేజీరోడ్‌లోని పుట్టింటికి వెళ్లింది. భార్యను చూసేందుకు తిరుపతి సోమవారం రాత్రి బైక్‌పై అత్తారింటికి బయలుదేరాడు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి..

తిరుపతి బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన తీరును పరిశీలిస్తే హెల్మెట్ పెట్టుకొని ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనలో అతని తలకు మాత్రమే బలమైన దెబ్బతగలండంతో మృతి చెందినట్లు చెబుతున్నారు.

కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయి దహనం

- 64 కేసుల్లో 522.544 కిలోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 2021 నుంచి వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని ఇన్సినేటర్ ఫ్యాక్టరీలో మంగళవారం దహనం చేసినట్లు సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసుల్లో పట్టుబడిన రూ.1,30,38,600 విలువైన 522.544 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి ఎఫ్‌ఎస్‌ఎల్ కొరకు శాంపిల్ తీయగా మిగిలిన మొత్తాన్ని కరీంనగర్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉందన్నారు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయించే, సేవించే వారి వివరాలు పోలీసులకు తెలియజేస్తే సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, సీసీఆర్‌బీ సీఐ సతీష్, ఆర్‌ఐ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదలు, ప్రభుత్వ రంగాల పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీనివాస్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలపై కేసు నమోదు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్, సయ్యద్ ఆరీఫ్ వరుసకు సోదరులు. బషీర్ గతేడాది ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి భూమిని రూ.1.20 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరీఫ్ ఆయనకు పోటీగా ఈ ఏడాది రూ.1.50 లక్షలు చెల్లించి కౌలుకు తీసుకుంటానని భూయజమానికి చెప్పాడు. ఈ విషయంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇరు కుటుంబాలు దాడులకు పాల్పడడంతో సయ్యద్ ఆరీఫ్, షేక్ హీనా, జుబేర్, సాదిక్, బషీర్, తహేర్‌కు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు.